# కెవ్వుమన్నకేక

అద్దేపల్లి సుచిత్రాదేవి



“ఏమిటోయ్ కామేష్. యిలా కూర్చుని వున్నావు. ఏదో చాలా బాధల్లో వున్నట్లు!” దిగులు ముఖంతో పార్కులో ఓ మూల ఒంటరిగా కూర్చుని వున్న కామేష్ దగ్గరకొచ్చి కూర్చుంటూ అడిగాడు హనుమంత్రావ్.

దీర్ఘాలోచనలో పడి పరధ్యానంగా తన పక్కనున్న పచ్చిక పీకి పడేస్తున్న కామేష్ హనుమంత్రావుని గమనించనే లేదు. హనుమంత్రావు స్పీడ్‌గా పచ్చిక వైపు చూస్తున్న కామేష్ చేతిని పట్టుకుని ఆపుతూ “కామూ, ఏమిటీ గడ్డి పీకడం? ఇటు చూడు యిప్పటికే ఓ మోపెడు కోసినట్లున్నావు. అయినా పిచ్చుక మీద బ్రహ్మాస్త్రమన్నట్లు నీ ఆలో చన్ల దాడిని పాపం పచ్చని యీ పచ్చిక మీద చూపుతావేం? మాలి చూస్తే అరవగలడు.”

అప్పటికి పూర్తిగా యీ లోకంలోకి వచ్చిన కామేష్ దేవదాసులా ఓ జీవం లేని నవ్వు నవ్వేడు.

“హు, మాలి నన్ను ఏమీ అనడు. ఈ పక్కంతా గడ్డి ఎక్కువుందని అతనే నన్నిక్కడ కూచోమని రిక్వెస్టు చేశాడు నిన్న!” జాలిగా అన్నాడు.

‘ప్చ్, ఇంతకూ యీ గడ్డి పీకడం దేనికట? అయ్‌మీన్ నీ దీర్ఘాలోచన్లు దేనికట?” హనుమంత్రావు మిత్రుడి మీద బోలెడు సానుభూతి చూపిస్తూ అడిగాడు.

కామేష్ మళ్ళీ పేలవంగా నవ్వేడు.

“మాట మాటకీ యిలా ఏడ్చినట్లు నవ్వేకన్నా ఏడవటమే బాగుంటుందేమో. అయినా విషయం చెప్ప గురుడా అంటే అలా పిచ్చి నవ్వులు నవ్వుతావేం?” విసుక్కున్నాడు హనుమంత్రావ్ కామేష్ మీదున్న చనువుకొద్దీ.

అంతే, ఒక్కసారిగా బావురుమన్నాడు కామేష్.

“ఆపావు. ఆ నవ్వుకన్నా ఏడుపు బెటరంటే ఏడవమని కాదు అర్థం” కంగారుగా ఆపాడు హనుమంత్రావు.

“ఏం చెప్పను గురూ. నా బాధ ఎవరికీ రాదు. వస్తేకానీ అర్థం కాదు.”

“అర్థమయ్యేలా చెప్ప మిత్రమా!” హనుమంత్రావు దీనంగా అడిగాడు.

“కెవ్వుమన్న కేక!” శూన్యంలోకి చూస్తూ మెల్లగా అన్నాడు కామేష్.

ఉలిక్కిపడ్డాడు హనుమంత్రావ్.

“కామూ, మొన్న సండే చూశాను బాగానే వున్నావు కదా. ఇంతలో ఏమయింది నీకు యిలా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నావు! పద. నీ మనసేం బాగున్నట్లు లేదు. నిన్ను యింట్లో వదిలివస్తాను” జాలిగా స్నేహితుడి వంక చూస్తూ అన్నాడు.

“ఇల్లా? బాబోయ్ వద్దు. ఇంటికెళ్ళింది మొదలు ఆ కెవ్వుమన్న కేకలు విన్లేక నా చెవులు గింగుర్లెత్తుతున్నాయి. అందుకే ప్రశాంతంగా వుంటుందనియిలా పార్కులెంటా, బీచిలెంటా తిరుగుతున్నాను” ఇల్లనగానే బెదురుగా అన్నాడు కామేష్.

“ఇంట్లో కెవ్వుమన్న కేకలా?! కొంపదీసి మీ యింట్లో దయ్యాలు, భూతాలు గాని వున్నాయా?” కుతూహలంగా అడిగాడు హనుమంత్రావ్.

“దెయ్యాలా. భలేవాడివే, మేమెళ్ళి గనక శ్మశానంలో కాపురం పెడితే ఒకవేళ దెయ్యాలనేవి ఏమైనా వుంటే అవి అక్కడ్నుంచి కూడా

పరారయిపోతాయి!"

"అదెలా సాధ్యం? బిస్తా గ్రామం వెళ్ళి కాష్మోరా లాంటి విద్య లేవన్నా నేర్చుకున్నావా?" అనుమానంగా అడిగాడు.

"బిస్తా లేదూ బస్తా లేదు. అంతా కేకల మహత్యం!" తేలిగ్గా అనేశాడు కామేష్.

"కేకలా?!"

"ఆ, కేకలంటే మామూలు కేకలా, కెవ్వుమన్న కేకలు!" మళ్ళీ తేలిగ్గానే అనాలనుకున్నాడు కానీ బరువుగానే పలికింది గొంతు.

"ఇద్దో బాస్, ఈ కేకలేంటో, కెవ్వుమనడం ఏమిటో అంతా వివరంగా అర్థమయ్యేలా చెప్పలేదూ, నేనిప్పుడు జుట్టు పీక్కుని కెవ్వుమని అరవాల్సి వస్తుందంతే!" కోపంగా అన్నాడు హనుమంత్రావు.

అంతే, అంతవరకు ఏదేదో మాట్లాడుతుండిన కామేష్ చటుక్కున అలర్టయిపోయాడు.

"బాబ్బాబు అంత పని చేసి మాత్రం మిత్రద్రోహం చేయకు. విషయం అంతా వివరంగా చెప్తాను."

"దట్సగుడ్. అలా బుద్ధిగా కేకలోకిరా!" గబుక్కున అనేసి కసిక్కున నాలిక కొరికేసుకుని "ఛట్ నీతో మాట్లాడి నాకూ కేకల గొడవే అయిపోయింది" అన్నాడు.

"అంతే గురువా. కేక గుండ్రంగా వుండును అని కూడా నాకీ మధ్యే తెలిసింది. నేనీ మధ్య పది మాటలు మాట్లాడితే తొమ్మిది కేకలే వుంటున్నాయని మా ఆఫీసులో అందరూ నన్ను "కేకేష్" అంటున్నారు. అంతేనా యీ మధ్య మా వీధి పేరు కూడా మారిపోయింది మా వల్ల. మా ఏరియాకొచ్చి కేకల వీధిలో కేకల వారిల్లు ఏది అనడుగు యింకా మాటల్రాని పిల్లాడు కూడా వేలు చూపుతాడు. అలా మొత్తం కేకలమయం అయిపోయింది నా జీవితం!" నిట్టూర్చాడు కామేష్.

తలలోకి చేతులు పోనిచ్చి జుట్టు పీక్కోబోయాడు హనుమంత్రావు. తరవాతి స్టేజి కేక అని అతన్ని గమనించిన కామేష్ నేరుగా టాపిక్‌లో కొచ్చేశాడు.

"హనుమా. నీకు తెలుసుగా మా ఆవిడకి పుస్తకాల పిచ్చి కాస్త ఎక్కువని. అస్తమానం ఏదో వీక్లీలు, మంత్లీలు, నవలలు యిలా చదువుతూనే వుంటుంది. రోజులో ఎక్కువ భాగం పుస్తకాల్లోనే గడిపి ఆయా పుస్తకాల్లోని పాత్రల మాటలు, వూత పదాలు చెప్తూండేది యిదివరకు. అదేమి పెద్ద యిబ్బందికరంగా వుండేది కాదు కనుక నేనూ ఏదో తన అలవాటులే అనుకునేవాణ్ణి. కానీ యీ మధ్య ... యీ మధ్య" ఆగాడు కామేష్ ఏదో గుర్తుకువచ్చిన వాడిలా భయంగా.

"ఏమిటి యీ మధ్య ఏమయింది?" ఆదుర్దాగా అడిగాడు హనుమంత్రావు.

"ఈ మధ్య మాటకు ముందు కెవ్వుమని కేక వస్తుంది. అదేంటే అంటే యిప్పుడొచ్చేవి అన్నీ క్రైమ్, మాఫియా, గుండాయిజమ్ మొదలైన వాటి మీద హింసాత్మక రచనలే కదా, వాటిల్లోని పాత్రలు అస్తమానం ఏదో ఓ సీన్‌లో ఎలాగోలాగ చేజ్ కాబడుతూనో, బెదిరింపబడుతూనో, చంపబడబోతూనో కెవ్వు కెవ్వుమని అరుస్తూనే వుంటాయి కదా. అవి చదివి చదివి తనకూ అలా అరవటం అలవాటయి పోయిందట. పొద్దున్నే లేవడం కెవ్వుమని అరుస్తూ లేస్తుంది. రాత్రి మళ్ళీ పడుకోవటం కెవ్వుమంటూనే పడుకుంటుంది."

"మరీ ప్రతిదానికీ అలా అరుస్తుందా?" ఆశ్చర్యంగా అడిగాడు హనుమంత్రావు.


"ప్రతిదానికీనా? ఆఖరికి 'దానికి కూడా!..'ఆగి అర్థవంతంగా చూశాడు కామేష్. "దానికీ అలానే అరవటం మొదలు పెట్టింది. నేను చేయి వేయగానే కెవ్వుమంటూంది. దాంతో నేను బిక్కచచ్చి అవుట్! ఆ తర్వాత తను మామూలుగానే వున్నా నాకు మూడ్ రాదు. ఆడ స్పర్శ తగిలి ఆరు నెల్లయింది" దీనంగా చెప్పాడు.

"అయితే కేక చాలా సీరియస్. ఛ ఛ కేసు చాలా సీరియస్ లాగుందే" ఆలోచిస్తూ అన్నాడు హనుమంత్రావు.

"అంతే గురూ, నే చెప్పాగదా. ఓ అయిదు నిముషాలు మాతో మాట్లాడితే చాలు అవతలి వాళ్ళకూ యీ కేకల గొడవంటుకుంటుంది. మా ఆవిడ పేరు రేఖ అని నీకు తెలుసుగా. మర్చిపోయి యీ మధ్య "కేకా" అని పిలుస్తున్నాను. నేనేనా పాలవాళ్ళు, కూరలవామ్మాయ్, పనిమనిషి కూడా రేఖమ్మగారూ అనే బదులు "కేకమ్మగారూ" అని పిలుస్తున్నారు. కొన్నాళ్ళకు మొదట ఆవిడ్ని ఆ తర్వాత నన్నూ పిచ్చాసుపత్రిలో చేర్పించాల్సి వస్తుందేమోనని భయంగా వుంది." ఆడవాళ్ళు కొంగుతో కళ్ళు వత్తుకున్నట్లు ముఖం వంచి చొక్కా కాలర్‌తో కళ్ళు తుడుచుకున్నాడు కామేష్.

"బాధపడకోయ్. శతకోటి దరిద్రాలకి అనంత కోటి ఉపాయాలన్నారు పెద్దలు. ప్రతి సమస్యకీ ఓ

## ఎగోనీ



కళ్ళముందు తెరుచుకున్న పుస్తకంలో
పంక్తుల పట్టాల మీద రైలుబండి
క్రీక్కిరిసి ప్రయాణిస్తూ ఉంటుంది
దిగాల్సిన స్టేషనేదో దగాచేసి తప్పిపోవడంతో
అక్షరాలా రైలుబండి మందుపాతరై పేలిపోతుంది!

గోడన వేలాడుతున్న కేలండర్
రెపరెపా కొట్టుకోగానే
రెప్పవాల్చడం మరచిన నేత్రద్వయం మీద
ఎగిరివచ్చిన జ్ఞాపకమేదో రెక్కలల్లార్చుతుంది
శిథిలవల్మీకంలోంచి అశ్రుసర్పం తొంగిచూస్తూ ఉంటుంది!

ఆకాశం గదిలోకి దూతను పంపి
తను కోల్పోయిన శ్రావణమేఘాల్ని పట్టితెమ్మంటుంది
రెండువేళ్ళ మధ్య నిప్పుకణిక ఇక సెలవన్నట్టుగా
చుర్రున కాలుతుంది...
అసంకల్పిత వీడ్కోలు సిగరెట్టుకు అనివాయితీ అవుతుంది!

మేఘప్రియ అయిన చీకటి
సాయంత్రావికల్లా సూర్యుడికి గంతలు కట్టేస్తుంది
చందమామఅందంగా ముక్కు విరుస్తుందేగాని కదలిరాదు
చుక్కలేవీ లేని రాత్రిలో మేఘమే పయనించినా
తీరంచేరేలోపునే జలజలా రాలిపోతుంది

కళ్ళముందున్న పుస్తకం మూసుకుపోతుంది
కళ్ళు మాత్రం తెరుచుకునే
చూపుల్ని వెంబడించి ఎక్కడో దారి తప్పతాయి!
రాత్రి వానకు తడిసిన ఆరుబయటి పత్రాల్లో
వేకువజామునే వెళ్ళి నేత్రాల్ని తడుముకోవాలి-

ఊహ తెలియకపముందు 'శ్రీ' ఇచ్చినందుకు
గడియారం ముఖం మీదకు నక్షత్రాల్ని విసురుతుంది
అనివార్యమై నిద్రలోకి మేల్కొనాల్సివస్తుంది!
అందాకా ఏదో పోగొట్టుకున్నట్టు అల్లాడిన ప్రపంచం
తిరిగిఎప్పట్లాగే విశృంఖలమౌతుంది-

—పసునూరు శ్రీధర్‌బాబు

పరిష్కారం వుండనే వుంటుంది. నన్ను కొద్దిసేపు ఆలోచించనీ" ఓదార్చాడు హనుమంత్రావ్.

"ఆ, ఆ, ఆ చించడంలోనే యీ పీకుడు అలవాటయింది" గుప్పిళ్ళకొద్దీ గడ్డిపీకుతూ అన్నాడు కామేష్.

ఉన్నట్లుండి బిగ్గరగా "యుకేకా!" అరిచేడు హనుమంత్రావ్.

స్నేహితుడివంక సానుభూతిగా చూశాడు కామేష్.

"హనుమా, నేనిందాకే చెప్పానా, నా గొడవంతా వింటే చివరకి నీకూ ఏదో అవుతుందని. పాపం. ఓ అరగంట క్రితం వరకూ కూడా బానే వుండేవాడివి ప్చ్."

"ఛత్ నాకేం కాలేదు. "యురేకా" అని అరవబోయి నీ కేకల పురాణ మహత్యం వలన "యుకేకా" అని వచ్చేసిందంతే. ఇంతకీ నన్ను చెప్పనివ్వు. మంచి అయిడియా తట్టింది!" కామేష్ ముఖం, పార్కులో ట్యూబ్ లైట్లు ఒకేసారి వెలిగాయి.

"ఏం తట్టింది? ఏం తట్టింది?" ఆత్రుతగా అడిగాడు.

"ఇప్పడొస్తున్న తెలుగు నవలలు, సీరియల్స్ చదివే కదా అవిడలాగయింది. వాటిని యింట్లో దొరకనివ్వకు. అసలేపుస్తకమూ యింటి దరిదాపులకు రాకుండా చూడు. దాంతో బుర్ర కొన్ని రోజులకు ఖాళీ అయి ఆపై నార్మల్‌గా అవుతుంది."

"సరిపోయింది. నా భార్య ఓ పుస్తకాల పురుగు అని ముందే చెప్పా కదా. నీళ్ళలోంచి చేపను బయటపడేస్తే ఎలా గిలగిలలాడుతుందో అలా కేకను కూడా అయ్‌మీన్ రేఖనూ పుస్తకాలు చదవొద్దు అంటే విలవిల్లాడుతుంది."

విసుగ్గా చూశాడు హనుమంత్రావ్.

"అబ్బా. సరే తెలుగు పుస్తకాలు చదవనివ్వకు. లావుపాటి ఇంగ్లీష్ నవల్సు చూసి తెచ్చిస్తుండు. అవయితే చీమంత అక్షరాల్తో నాలుగయిదు వందల పేజీలుంటాయి. నింపాదిగా చదువుకుంటూ వుంటుంది."

"ఏడ్చినట్లుంది. ఈ అయిడియా నాకు మొదటి రోజు సగం మోపు గడ్డిపీకినప్పుడే వచ్చింది. అలాగే తీసుకెళ్ళి యిచ్చా కూడా."

"గడ్డెందుకు ఇచ్చావు?" ఆశ్చర్యంగా అడిగాడు హనుమంత్రావు.

"తింటానికి!" కోపంగా అని. "అబ్బా, గడ్డి కాదు గురుడా. ఇంగ్లీష్ నవలలు" అన్నాడు.

"ఏం. ఏమయింది? గుణం కనిపించలేదా?" కుతూహలంగా అడిగాడు హనుమంత్రావు.

"నేనిచ్చిన నవలని పది పేజీలు చదవగానే మామూలుగా కన్నా కూడా గాట్టిగా కెవ్వున కేక వేసింది. కంగారుపడి ఏమయింది అని అడిగా. ఆ నవల తెలుగులో తానెప్పుడో చదివేసిందట. మరో టిచ్చా. అదీ అంతేనుట" నిరుత్సాహంగా అన్నాడు కామేష్.

"బాడ్. వెరీబాడ్. యిలా తెలుగు సాహిత్యాన్నంతా అంతంత లావు పేరున్న ఆంగ్ల రచయితలంతా తస్కరించడం ప్చ్.

ఏమవుతుందీ సాహిత్యం? ఎటు పోతున్నాయి విలువలు?"

"ఏమవుతుందీ దేశం?" అన్న స్టయిల్‌లో అన్నాడు హనుమంత్రావ్. అతన్నో అమాయకుడ్ని చూసినట్లు చూశాడు కామేష్.

"నీకింకా తెలుగు, ఆంగ్ల నవలలకున్న లింకులు తెలిసినట్లు లేదులే. ఇక సాహిత్యమంటావా, కేకల్లోకి పోతుందని ముందే చెప్పాకదా?" అన్నాడు.

"మరింకేం చేస్తావు పాపం? ఆ ... యు..." మధ్యలోనే అతన్ని తక్కున ఆపేశాడు కామేష్.

"కేక అనకు. విషయం చెప్పు చాలు."

"ఏం లేదోయ్. ఏమీ తోచక కదా మీ శ్రీమతి పుస్తకాలూ అవీ చదువుతుంది. ఎలాగోలా వి.సి.ఆర్. కొను. సినిమా కేసెట్స్ తెచ్చిస్తూండు. దాంతో నీ కేకల ప్రాబ్లెమ్ సాల్వవుతుంది."

"హు. ఇప్పడొస్తున్న సినిమాలు తక్కువ తింటున్నాయా. అవీ రక్తం చిందుతున్నాయి. వద్దులే. కేక మరి కాస్త ముదరవచ్చు" నిరాశగా అన్నాడు కామేష్.

"పోనీ స్టార్ టీవీ కనెక్షన్ పెట్టించు టీవీకి. ఇరవై నాలుగు గంటలు ప్రోగ్రాములు వుంటాయి. చక్కగా అవి చూస్తుంటే బోలెడు కాలక్షేపం. పైగా పెద్ద ఖర్చూ వుండదు" మరో సలహా పడేశాడు హనుమంత్రావు.

"దానితో కొత్త కొత్త సమస్యలున్నాయని స్టార్ టీవీ ప్రోగ్రాములు చూస్తున్న కొందరు ఫ్రెండ్సు వాపోతున్నారు. అనవసరంగా పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టవుతుందేమో" దానికీ తల అడ్డం తిప్పాడు కామేష్.

"అన్నింటికీ అన్నీ చెపుతున్నావు. ఇక నీ ఖర్మ! నే వెళుతున్నా నీ కేకలేంటో, యీ గడ్డి పీకటం ఏమిటో నువ్వే అఘోరించు" హనుమంత్రావుకి కోపం వచ్చి విసురుగా లేచ్చక్కా వెళ్ళిపోయాడు.

"గుడ్ బై మిత్రమా. నా ఖర్మ కేక పెడితే నెక్స్టు పిచ్చాసుపత్రిలోనే కలుసుకుంటామేమో" గొణుక్కున్నాడు కామేష్.

మరి కాసేపటికి మాలి వచ్చి వినయంగా చెప్పాడు.

"ఈ రోజుకీ గడ్డి చాలులే బాబుగారూ, మరీ పొద్దుపోతే పురుగూ పుట్ర తిరుగుతాయేమో. తమరీ పూటకి యింటికెళ్ళిపోయి రేపు రండి. అన్నట్టు రేపు సాయంకాలం ఆ మందార మొక్కల దగ్గర కూసోండి బాబూ. అటేపు కూడా మరీ గడ్డెక్కువగా వుంది".

కామేష్ అయోమయంగా బుర్రాడిస్తూ లేచి నిలబడి చేతులు దులుపుకుని నీరసంగా యింటి దారి పట్టాడు.

తమ వీధిలోకి రాగానే, ఇల్లు అల్లంత దూరాన కనిపిస్తూండగానే కాళ్ళు వణకడం మొదలుపెట్టాయి. చెవులు కేకలతో గింగుర్లెత్తడానికి సిద్ధమవసాగాయి.

గుండె చిక్కబట్టుకుని గుమ్మం ముందు నిలుచుని మెల్లగా కాలింగ్ బెల్ స్విచ్ నొక్కాడు.

తలుపు తెరవడం కామేష్‌కి గుమ్మంలో చూడగానే రేఖ కెవ్వుమని కేకవేసింది.

కామేష్ ఆ కేకను ఎదురు చూస్తున్నది కాబట్టి మరీ పెద్దగా భయపడకుండా యింట్లోకి నడిచాడు.

హాల్లోనే సోఫాలో చేరగిలబోతున్న అతన్ని చెయి పట్టుకుని మరోమారు కెవ్వుమని, ఆపై నవ్వుతూ బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళింది రేఖ. "మీకో విషయం చెప్పాలి రండి" అంటూ అక్కడ అతని రైటింగ్ టేబిల్‌పై దొంతర్లు దొంతర్లుగా ఓ వేపు తెల్లకాగితాలు పేర్చి వున్నాయి. మరోవైపు ఏదో వ్రాస్తున్న కాగితాలున్నాయి.

"ఏమిటిదంతా?" వింతగా అడిగాడు.

రేఖ ముందు అలవాటుగా కెవ్వుమని తర్వాత నవ్వింది.

"అస్తమానం వాళ్ళూ వీళ్ళూ వ్రాసిన సీరియల్స్, కథలు చదువుతుంటాను కదా. సడన్‌గా యీవేళ నాకో ఆలోచన తట్టింది. ఇప్పటికెన్ని పుస్తకాలు చదివాను. ఏముంటున్నాయి వాటిల్లో. పిచ్చి సెక్సే. చచ్చు క్రైమ్స్, రౌడీలు, ఫిస్టల్స్, కత్తులు, రక్తాలు, కేకలు. ఓస్ యింతోటి నవలలు నేను వ్రాయలేనా అనిపించింది. అంటే అప్పటికప్పుడు మాంచి హింసాత్మక రచనొకటి మనసులో కెవ్వుమంది. అప్పట్నుంచీ కూచుని వ్రాస్తున్నాను. ఇప్పటికే యాభై పేజీలయిపోయింది.

ఇక చూస్కోండి మీ భార్య రేఖ అంటే ఏమిటో తెలుగు పాఠక లోకానికి తెలిసి వస్తుంది. నా రచనలు చదివి యిల్లిల్లూ కేకలతో ప్రతిధ్వనిస్తూందనుకోండి!" ఇప్పడొస్తున్న మాఫియా, గుండాయిజమ్, హత్యలు అంటూ వచ్చే సస్పెన్స్, థ్రిల్లర్స్ నవలలు చదివే యిలా మారిన రేఖ. యిక తనే రాయటం మొదలెట్టిందంటే యింకా ముందు ముందు ఎలా మారబోతుందో, తెలుగు పాఠకులేమవుతారోనన్న వూహ రాగానే రేఖ కన్నా కూడా పెద్దగా కెవ్వుమని కేక వేసి పడిపోయాడు కామేష్.